కథ

# బేలన్స్

-వి. రామలక్ష్మి

**''సూర్యుడు, చంద్రుడు, భూమి వగైరా గ్రహాలు తమకి నిర్ణీతమైన కక్ష్యాలో తిరుగుతూ ఉంటాయి!**

ఒక వేళ వాటిలో ఏదో ఒకటి బేలన్స్ తప్పి తమ కక్ష్య దాటితే ఏమవుతుంది?

సర్వనాశనం అవుతుంది. సృష్టి అల్లకల్లోలం అవుతుంది. అంత పెద్ద విషయాలెందుకు?

తీగ మీద నడిచే మనిషి కర్ర నొకదాన్ని పట్టుకుని బేలన్స్ చూసుకుంటూ నడుస్తాడు.

ఒక వేళ బేలన్స్ తప్పితే ఏమవుతుంది?

ఆ వ్యక్తి కింద పడతాడు. నడుం విరగడమో, తలపగిలి చావడమో ఏదైనా జరగొచ్చు.

అంటే ఏదైనా ఉండాల్సిన బేలన్స్‌లో లేకపోతే పూడ్చుకోలేని నష్టం సంభవిస్తుందన్న మాట.

జీవితం కూడా అంతే! డబ్బు సంపాదించడం, ఖర్చు పెట్టుకోవడంలోనే కాదు, అన్ని విషయాల్లో కూడా బేలన్స్ ఉండాలి. ఏది ఎక్కువా, తక్కువా కాకుండా ప్రతిదీ అచి, తూచి! ఏది ఎక్కడ ఎలా చేయాలో అలాగే చేయాలి. ఒక వేళ అలాకాక జీవితంలో బేలన్స్ కోల్పోతే ఏమవుతుంది?

జీవితం కుప్పకూలిపోతుంది. మన జీవితమే కాదు. మనతో సంబంధం ఉన్న వాళ్ళ జీవితాలు కూడా నాశనం అవుతాయన్న మాట!''

ఈ వాక్యాలు ఎక్కడో చదివినట్టుంది. ఎక్కడబ్బా! చదువుతున్న పుస్తకంలో వేలుంచి మూసి, గుండెలమీద పెట్టుకుని, కళ్ళు మూసుకుని ఆలోచించసాగాను.

ఇవాళ కరెంట్ పోయింది. లేకపోతే టి.వి.లో సినిమా చూసేదాన్ని. రోజూ మధ్యాహ్నం అదే కాలక్షేపం. ఏం చేయాలో తోచక ఆయన టేబుల్ పైన ఉన్న లైబ్రరీ పుస్తకం తీశాను చదువుదామని. నా చిన్నప్పుడు టి.వి.లు లేవు రేడియోలు తప్ప. అందువల్లో ఏమోమరి! పుస్తకాలు చదివే వాళ్ళం. ఇప్పటి పిల్లల్లా మాకు ఎందుకో చదువు అంత యజ్ఞంలా ఉండేదికాదు. ఆడుతూ, పాడుతూ చదివినట్టు చదివేవాళ్ళం. పెద్దవాళ్ళు తిడుతున్నా వినిపించుకోకుండా వారపత్రికలు రాగానే మొట్టమొదట సీరియల్స్‌తో మొదలుపెట్టి, కథలు వగైరాలతో పాటు చిత్రజ్యోతి చివరి మాట పూర్తయ్యే దాకా వదిలేవాళ్ళం కాదు. అది చాలదన్నట్టు లైబ్రరీ నుంచి పుస్తకాలు తెచ్చుకోవడం ఒకటి. ఈ టి.వి.లొచ్చాక లైబ్రరీ పుస్తకాలే కాదు, వారపత్రికలు కూడా చదవడం మానేశాం! లేచింది మొదలు పడుకునే దాకా టి.వి.యే.

ఇదిగో! ఇలాంటి సందర్భాలలో మాత్రం పుస్తకాలు అవసరం అవుతాయి.

ఇంతకీ ఈ వాక్యాలు ఎక్కడ చదివేనబ్బా! ఎక్కడ? ఆలోచిస్తూ కింది పెదవి మునిపంటితో నొక్కుకోసాగాను.

చటుక్కున జ్ఞాపకం వచ్చింది! ఆ! ఇదే పుస్తకం! చిన్నప్పుడు ఫిఫ్త్ ఫారం చదివే రోజుల్లో చదువుదామని ప్రయత్నించాను. అయితే అప్పుడు ఆ వాక్యాలు చదివేసరికే బోర్ కొట్టింది. అదే మాట రాజుతో అన్నాను.

ఆ! రాజు! రాజు, నేను బాల్య స్నేహితులం.

ఆ మాటంటే రాజు అన్నాడు నాతో!

''నీకు జీవితం గురించి తెలుసుకోవడం, చదవడం ఇష్టం ఉండదులే! ఎప్పుడు చూసినా ఆరడుగుల అందగాడైన హీరోలు, ఇంపాలా కారులు, ఇవే కదా నీకు నచ్చేవి!''

అవును కదూ! నిజంగా రాజు అలాగే అన్నాడు. ఇవాళా, నిన్ననా? ముప్పై మూడేళ్ళక్రితం అన్న మాటలివి! అయినా ఎంత బాగా గుర్తొచ్చాయి!

రాజు! ఎంత తెలివైన వాడు!

పక్కపక్క ఇళ్ళు. ఒకే స్కూల్లో, ఒకే క్లాసులో ఓనమాలు దగ్గర్నుంచీ కలిసి చదువుకున్నాం.

అతనూ చదివేవాడు!

నేనూ చదివేదాన్ని!

కాని, మేం ఇద్దరం చదివే పుస్తకాలు వేరు!

ఆలోచనలు వేరు!

అందుకే అలా అస్తమానూ వేళాకోళం చేసేవాడు.

నేను ఉడుక్కునేదాన్ని!

''పోదు బడాయి! జీవితమూనూ! చదవడమూనూ! అలాంటి బరువు మాటలు చెప్పకు. నేను చదివే పుస్తకాల వల్ల వచ్చే హాయి ఆ బోర్ పుస్తకాలు చదవడం వల్ల రాదు, ఉట్టి తలనెప్పి తప్ప!''

నా మాటలు విని రాజు కోపం తెచ్చుకునే వాడు కాదు.

చిరునవ్వు నవ్వి వేరే టాపిక్ మార్చేవాడు.

ఎప్పటి రాజు! ఎప్పటి మాట!

ఫిఫ్త్ ఫారం పరీక్షలు రాశాక కాబోలు వాళ్ళు మా ఊరు విడిచి వెళ్ళిపోయారు. వాళ్ళ నాన్నగారు జాబ్‌కి రిజైన్ చేసి కుటుంబాన్ని తీసుకుని సొంత ఊరుకి వెళ్ళిపోయారని చెప్పుకునే వారు. తరవాత మళ్ళీ రాజుని చూడలేదు. ఎస్.ఎస్.ఎల్.సి పాసవడం, పెళ్ళి, కాపురానికి రావడం, బాబు, పాప పుట్టడం, వాళ్ళ చదువులు, పెళ్ళిళ్ళు పూర్తయి ఎవరి బతుకులు వాళ్ళు బతకడం, ఇంకా ఈయనకి పదేళ్ళు సర్వీసు ఉండడంతో ఇద్దరం నిశ్చింతగా కాలం గడుపుతున్నాం! అన్నట్టు రాజు ఏమయ్యాడో కదా!

తలుపు చప్పుడవడంతో లేచి తలుపు తీశాను. ఆయన! అప్పుడే స్కూలు నుంచి వచ్చేశారు. ఐదయిపోయిందన్న మాట. ఆలోచనల్లో టైమే తెలియలేదు.

టీ పెట్టి, టిఫిన్ చేశాను. అవయ్యాక ఆయన విజయవాడ వెళ్ళాలని బయలుదేరారు. ఆయన కొలీగ్ సుందర్రావు కలర్ టి.వి కొంటాడట. అందుకని ఈయన సాయం వెళ్ళారు. మాది విజయవాడ దగ్గర పల్లెటూరు. ముఖ్యమైనవి ఏవి కొనాలన్నా అక్కడికే వెళ్ళాలి మరి!

నేను చిన్నంచిదరం పనులూ, వంటా పూర్తి చేసి, మొహం కడుక్కుని తయారై ఆయన కోసం ఎదురు చూస్తూ పడుకున్నాను. ఎనిమిదవుతోంది. ఆయనింకా రాలేదు. కరెంట్ కూడా లేదు. ఈ పల్లెటూళ్ళింతే. కరెంట్ పోయిందంటే ఓ పట్టాన రాదు.

మంచం మీద పడుకుని అటూ, ఇటూ దొర్లుతున్నాను. కొవ్వొత్తి వెలుగులో చదవలేను. గేస్ లైట్ వెలిగిస్తే ఆ సౌండ్ చిరాగ్గా ఉంటుంది. దోమలు చంపేస్తున్నాయి. లేచి టార్టాయిస్ వెలిగించి మళ్ళీ వచ్చి మంచం మీద పడుకున్నాను.

మళ్ళీ నా మనసులో రాజు మెదిలాడు! రాజు అన్న మాటలు మెదిలాయి. చిన్నప్పుడు పూర్తిగా చదవని ఆ వాక్యాలు ఇప్పుడు పూర్తిగా చదివాను. ఇది వరకట్లా ఇప్పుడవి బోర్ కొట్టలేదు. కాని అంత సీరియస్ డైలాగులు చదవడం, వాటి గురించి ఆలోచించడం నాకు చేతకాని పని. అలవాటు లేని పని.

అయినా ఎందుకు ఆ వాక్యాలు, రాజు పదే పదే గుర్తొస్తున్నారు ఇవాళ! అదే పుస్తకం చదవడం వల్ల కదూ! అవును! లేకపోతే నాకు జీవితం అంటే చక్కగా కాంక్రీటు రోడ్డు మీద సాగిపోయే కారులా

ఉంటుంది. అమ్మా, నాన్న పోయినప్పుడు, ఆయనకి పిల్లలకి ఏవేవో అనారోగ్యాలు చేసినప్పుడు, అలాంటి ఏవో సందర్భాలలో తప్ప ఎప్పుడూ నాకు పెద్ద పెద్ద కష్టాలు ఎదురవలేదు. చాలా సుఖంగానే ఉన్నాను.

మరి! జీవితం అంటే ఎందుకు అంత పెద్ద పెద్ద మాటలు, వాక్యాలు రాసి రచయితలు, రాజులాంటి వాళ్ళు కంగారు పెడతారు? కొందరికి అంత కఠినంగా ఉంటుందా జీవితం! నిజమేనేమో!

అంత చిన్న వయసులో రాజు ఎందుకలా మాట్లాడాడు? అప్పుడు ఆలోచించలేకపోయాను గాని ఇప్పుడు జ్ఞాపకం తెచ్చుకుంటుంటే గుర్తొస్తోంది. రాజు వాళ్ళ ఇల్లు ఎప్పుడూ గలీజుగా, చికాగ్గా ఉండేది. ఎప్పుడు చూసినా వాళ్ళమ్మ తల దువ్వుకోకుండా మాసిన చీరతో ఉండేది. వాళ్ళు తిండి తింటుంటే చూసేదాన్ని. ఆ అన్నం ముతగ్గా ఉండేది. ఎప్పుడూ ఆవకాయ వేసుకుని వాళ్ళు తింటుండమే నాకు గుర్తు. మా ఇంట్లో అయితే సన్నబియ్యం తెల్లటి అన్నం, పప్పు, కూర, పచ్చడి, పులుసు, ఘుమఘుమలాడే నెయ్యి, పెరుగుతో తినే వాళ్ళం.

మరి మా నాన్న గారికీ, రాజు వాళ్ళ నాన్నగారికీ ఒకటే ఉద్యోగాలు! కాని ఎందుకు అలా ఉండేది?

మా ఇంట్లో అయితే నేనొక్కదాన్నే. వాళ్ళింట్లో అయితే రాజు తరువాత నలుగురు చెల్లెళ్ళు. అదేం కాదు. ఇంకేదో ఉంది!

ఆ! అమ్మ ఒకసారి నాన్నతో అనగా విన్నాను.

''ఏవండీ! వెంకట్రావు గారు బ్రాకెట్టాడతాట్ట కదా?''

''అవునే! అందుకే ఎక్కడలేని డబ్బూ వాళ్ళకి చాలదు. ఊరంతా అప్పులే'' నాన్న అలా సమాధానం చెప్పిన గుర్తు.

ఇప్పుడు ఒక్కోటీ తలుచుకుంటుంటే గుర్తొస్తోంది.

ఊరంతా చేసిన అప్పులు తీర్చలేక వెంకట్రావు గారు జాబ్‌కి రిజైన్ చేసి, వచ్చిన డబ్బుతో అప్పులు తీర్చేసి సొంత ఊరెళ్ళిపోయారు రాజు వాళ్ళని తీసుకుని.

ఏమిటీవేళ ఇలా ఆలోచిస్తున్నాను? ఎప్పటెప్పటి సంగతులో ఒకదాని తరువాత ఒకటి తోసుకుంటూ గుర్తొస్తున్నాయి.

అరే! ఎనిమిదిన్నర అయింది. ఇంకా రాలేదేమిటీ ఈయన?

కంగారుగా మంచం మీంచి లేచాను.

పక్కింటికెళ్ళి సుందర్రావు గారి భార్యని అడుగుదామని తలుపు వేపు నడిచాను. ఇంతలో తలుపు చప్పుడయ్యింది. ఆత్రుతగా తలుపు తీశాను. ఎదురుగా సుందర్రావు చేతిమీద కట్టుతో. నా పైప్రాణాలు పైనే పోయాయి.

''ఈయన ఏరీ? ఆ కట్టేంటీ?''

''కంగారు పడకండి. చిన్న యాక్సిడెంట్ అయింది.''

''ఆ! ఆయనెలా ఉన్నారు?''

''బాగానే ఉన్నారు. వెళ్ళి చూద్దాం రండి.''


''ఏమైంది చెప్పండీ!'' చేతుల్లో మొహం దాచుకుని ఏడవ సాగాను.


''ప్లీజ్! ఏడవకండి సుగుణా! ఆయన బాగానే ఉన్నారు. ఏం కాలేదు'' అంటూ సుందర్రావు వెనకాలే వచ్చిన ఆయన భార్య సరళ మొహం మీదున్న నా చేతులు బలవంతంగా విడిపించింది. గ్లాసుతో మంచినీళ్ళు తెచ్చి నా చేత తాగించింది.

నీళ్ళు తాగాను. అయినా దుఃఖం మింగుడు పడటం లేదు.

నిజంగా ఏం జరిగిందో చెప్పరూ!

''నేను, మధుసూదనం గారూ విజయవాడ వెళ్ళాం. టి.వి షాపులో టి.వి సెలెక్ట్ చేసుకుని, ఆర్డరిచ్చి తిరిగి బయలుదేరాం! మేం వస్తుంటే దారిలో






ఎదురుగుండా వచ్చే ఓ స్కూటరు మమ్మల్ని గుద్దేసింది. లక్కీగా మధుసూదనం గారూ, నేనూ రోడ్డు పక్కకి ఇసకలో పడి దొర్లాం. నా చేతికి గాజుపెంకు గీసుకుపోయింది. ఆయనకి స్పృహ పోయింది. మాకు పెద్ద దెబ్బలు తగల్లేదుగాని మమ్మల్ని గుద్దిన ఆ స్కూటర్ వాలాకి మాత్రం చాలా దెబ్బలే తగిలాయి. చావు బతుకుల్లో ఉన్నాడు. అతని వెనకాల కూర్చున్న అతను మాత్రం చిన్న చిన్న దెబ్బలతో బయటపడ్డాడు. ఇద్దరం కలిసి ఓ వేన్‌ని ఆపి వాళ్ళిద్దరిని తీసుకుని హాస్పటల్‌కెళ్ళాం. మరేం ఫరవాలేదు. ఇంకో అరగంటలో స్పృహ వస్తుందని ఈయన గురించి చెప్పారు. అందుకే మిమ్మల్ని తీసుకెళదామని వచ్చాను.''

వెంటనే నేనూ, సుందర్రావు గారు బయల్దేరాం!

ఆటో దిగి ఒక్క పరుగుతో హాస్పటల్ లోపలికెళ్ళాను. బెడ్‌మీద కూర్చుని ఉన్న ఆయన్ని చూశాక 'హమ్మయ్య' అని ఊపిరి తీసుకున్నాను.

''ఇందాకనగానే స్పృహ వచ్చింది. డిశ్చార్జి చేస్తానన్నారు. మీరు వచ్చే దాకా ఆగుతానని చెప్పాను'' నవ్వుతూ అంటున్న ఆయన ఒళ్ళంతా తడుముతూ ''దెబ్బలేం తగల్లేదు కదా?'' అన్నాను.

''లేదు'' అన్నారు ఆయన నా చేతిమీద చెయ్యేస్తూ.

''డాక్టరు గారు ఈ చీటీ ఇచ్చారమ్మా'' నర్సుని చూసి ఆయనకి దూరంగా జరిగాను.

''పదండి వెళ్దాం.'' డాక్టరు బిల్లులు కట్టేసి వచ్చిన సుందర్రావుని ఇద్దరం అనుసరించాం.

ఇంతలో ''సార్! ఒక్క పావుగంట ఉండండి ప్లీజ్! నేను వెళ్ళి ఆయన భార్యని తీసుకొస్తాను. ఇంతలో పేషెంట్‌కి ఏమైనా అవసరం రావచ్చు'' యాక్సిడెంట్ చేసినతని స్నేహితుడు అంటున్నాడు.

''ఆయనకెలా ఉంది?'' సుందర్రావు ఆత్రుతగా అడిగాడు.

''చెప్పలేం.''

''సరే. మీరు వెళ్ళండి. చాలా దూరమా?''

''లేదుసార్. దగ్గరే. ఈ ఊరే.''

హాస్పటల్‌కి తీసుకు రాగానే యాక్సిడెంట్ కేస అని తీసుకోమన్నారట డాక్టర్లు. అతను, సుందర్రావు గారు కలిసి డాక్టర్లని బతిమాలితే అప్పుడు ఒప్పుకున్నారుట. ఈయనకి దెబ్బలు తగల్లేదు కనుక సుందర్రావు పాపం ఇంటికొచ్చాడు. అతని పరిస్థితి సీరియస్ కనుక ఇతను వెళ్ళలేకపోయాడు.

మేం ముగ్గురం అక్కడే కూర్చున్నాం. కాస్సేపట్లో అతని భార్య కాబోలు ఏడుస్తూ వచ్చింది. పేషెంట్‌ని ఒకసారి చూస్తానంటే డాక్టర్లు దూరం నుంచే డిస్టర్బ్ చేయకుండా చూడమని అనుమతి ఇచ్చారు. ఆవిడతో పాటూ నేను వెళ్ళాను చూడాలని. అతన్ని చూస్తూనే ఒక్కసారి షాక్ తగిలినట్టయింది నాకు. అతను రాజు కదూ! వయసు వల్ల ఎంత మార్పొచ్చినా ఆ మొహం పోలికలు గుర్తుపట్టాను నేను. పొంగుకొస్తున్న ఏడుపుని నోట్లో కొంగు కుక్కుకుని అణచుకుంటోంది ఆవిడ. ఆవిడ భుజం చుట్టూ చేయివేసి నడిపించుకుంటూ బయటికి తీసుకొచ్చాను. వెక్కివెక్కి ఏడుస్తున్న ఆవిడని ఊరుకోబెట్టడం ఎవరితరమూ కావటం లేదు. ఆవిడ కొంచెం స్థిమిత పడ్డాక నేను, అతని స్నేహితుడిని పక్కకి తీసుకెళ్ళి వివరాలడిగాను.

అతను రాజే!

ఎంత చిత్రం! ఇవాళ అనుకోకుండా ఆ పుస్తకం చదవడం, రోజంతా రాజు గురించి అనుకోకుండా ఆలోచించడం! ఆఖరికి, చివరికి రాజుని ఈ స్థితిలో చూడడం! 'ప్చ్' అతని గురించి తెలిసిన సంగతులు నన్ను మరింత బాధపెట్టాయి.

''గుమాస్తా భార్య, గుమాస్తా భార్యలా ఉండకుండా ఆఫీసరు భార్యలా ఉంటానంటే కుదురుతుందమ్మా? ఆయన పాపం! చాలా మంచాయన. మొన్నటి దాకా అప్పులు చేసి తండ్రి చస్తే చెల్లెళ్ళ బాధ్యతలు మోశాడు. దానికితోడు ఈవిడ షోకులు ఒకటి మూడొందలకు తక్కువ చీర కట్టదు.''

నాకు వెంటనే ఆవిడ కట్టిన ఖరీదైన చీర గుర్తొచ్చింది. ఆయన చెప్పుకు పోతున్నాడు.

''రెండు వేలు పెట్టి డిన్నరు సెట్టు కొనిపించిదంటే ఇంకేం చెప్పాలి. అందుకే ఒక్క బిడ్డయినా కూతురికి పాతికేళ్ళు దాటుతున్నా పెళ్ళి చేయలేకపోయాడు. ఆ పిల్ల పక్కింటి స్టూడెంట్ కుర్రాడితో లేచిపోయింది. పొద్దుట్నించీ వెతుకుతున్నాం. ఎక్కడా దొరకలేదు. తలపగిలిపోయేలా ఉందని, చచ్చిపోతానని అంటుంటే మరిపించడానికి బార్‌కి తీసికెళ్ళానమ్మా! మొట్టమొదటసారేమో మందు బాగా కిక్కిచ్చింది. దానికితోడు వద్దండీ అంటే వినలేదు. తనే డ్రైవ్ చేస్తానని పట్టు. అక్కడితో స్కూటరు బేలన్స్ తప్పి యాక్సిడెంట్ అయింది.''

అతను చెప్తున్నంత సేపూ నా మనసులో విపరీతమైన ఆందోళన.

రాజు!

తన ఇంటి పద్ధతులు నచ్చక, తరచూ మా ఇంట్లో గడిపే రాజు!

జీవితం గురించి సీరియస్‌గా ఆలోచించు అని వయసుకి మించి చెప్పే రాజు!

అన్ని తెలివితేటలున్నా రాజు ఎందుకలా అయ్యాడు?

చాలా చాలా బాధగా ఉంది.

తెల్లవారితే గాని ఏం చెప్పలేమన్నార్ట డాక్టర్లు.

వచ్చిన పోలీసులకి డాక్టరు సాయంతో నచ్చచెప్పి పంపేశాం.

ఆవిడకి ధైర్యం చెప్పి, అతని స్నేహితుడికి వాళ్ళని జాగ్రత్తగా చూడమని, మళ్ళీ పొద్దుటే వచ్చి చూస్తామని చెప్పి ఆటోలో ముగ్గురం ఇంటికి బయల్దేరాం.

''ఫుల్లుగా తాగేసేట్ట. అందుకే స్కూటరు బేలన్స్ తప్పింది'' సుందర్రావు అంటున్నాడు.

''కాదు. జీవితం బేలన్స్ తప్పింది.''

వాళ్ళిద్దరూ నాకేసి వింతగా చూశారు.

''నేను తెచ్చిన పుస్తకం చదివావా?'' మా వారు అడుగుతున్నారు.

''పుస్తకం ఇంకా పూర్తిగా చదవలేదు. చదువుతాను. కాని జీవితం బేలన్స్ తప్పడం మాత్రం చూశాను.''

వాళ్ళకి రాజు జీవితం గురించి చెప్పసాగాను.

ఆటో నున్నటి రోడ్డు మీద మెత్తగా పోతోంది.